## డీఎంహెచ్‌వోగా నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారిగా నరేందర్ రాథోడ్‌ను నియమిస్తూ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినజెడ్ చోంగ్త్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణను మహబూబ్‌నగర్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా డిప్యూటేషన్‌పై పంపించగా పీవో డీటీటీగా వ్యవహరిస్తున్న నరేందర్ రాథోడ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

## రిమ్స్‌లో వైద్యపోస్టులకు ఇంటర్వ్యూ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు మంగళవారం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ప్రొఫెసర్ పోస్టులకు ఇద్దరు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇద్దరు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నలుగురు, ట్యూటర్ పోస్టులకు 23 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3/23.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తగ్గుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారులు 68వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని మంగళవారం రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. అండర్ 14 విభాగంలో కే.చరణ్, ఎం.సాయిరాం, ఎం.విష్ణువర్ధన్, అండర్ 17 విభాగంలో బి.విశ్వజ్ఞ, పి.మనిక్రిష్, జి.సందీప్ ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. నవంబర్ 2 నుంచి 4వరకు హైదరాబాద్‌లోని బోరాన్ పల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

### జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి


పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చాందా క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎస్జీఎఫ్ అండర్–14, 17 బాలబాలికల అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో రాణిస్తే భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, వీజీయస్ అకాడమీ నిర్వాహకులు రాకేష్, జ్యోతి స్వరన్, తదితరులు పాల్గొన్నారు.

### సైన్స్‌సెమినార్‌లో తృతీయ స్థానం


అవార్డు అందుకుంటున్న వృందసాన్వి

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లో తెలంగాణ విద్యా పరిశోధన మండలి నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో జిల్లాకు తృతీయస్థానం దక్కింది. మంగళవారం కృత్రిమ మేధస్సు–సామర్థ్యాలు–సందేహాలు అనే అంశంపై జరిగిన పోటీల్లో ఆదిలాబాద్ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ విద్యార్థిని లుందే వృందసాన్వి రాణించింది. ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బహుమతి ప్రదానం చేశారు. గైడ్ టీచర్ సారిక దేశ్‌పాండే, డీఈవో ప్రణీత, సైన్స్ అధికారి రఘురమణ, జిల్లా సైన్స్ సహాయ అధికారి భాస్కర్ అభినందించారు.

### కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ధర్నా


బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

కైలాస్‌నగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,400 కోట్లు రావాల్సి ఉందన్నారు. స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే దుస్థితి ఏర్పడగా, చదువు పూర్తి చేసిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఆ సంఘ నాయకులు కార్తీక్, నిఖిల్, మహేష్, సంజయ్, ఆదిత్య, సాయి, అశ్విత, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్ మార్కెట్‌కు పత్తిలోడుతో వచ్చిన వాహనాలు (ఫైల్)

# పత్తి రైతు చిత్తు



ఈ రైతు పేరు ఉత్తం చౌహాన్. తలమడుగు మండలం తలాయిగూడకు చెందిన వాడు. ఈ వానకాలంలో తనకున్న 23 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. మొదటి తీతలో కేవలం 19 క్వింటాళ్లు మాత్రమే చేతికందింది. ఈ పత్తికైనా మార్కెట్లో మంచి ధర లభిస్తుందని ఆశించాడు. అయితే ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.6,840 చొప్పున కొనుగోలు చేయడంతో రూ.లక్ష 30వేల వరకు చేతికందాయి. ఈ డబ్బులు ఆయన ప్రణాళిక ఖర్చులకు ఎటూ సరిపోని పరిస్థితి ఉంది. వచ్చే వేసవి వరకు తన చెల్లెలి వివాహం చేసేందుకు డబ్బులను కూడబెడదామనుకున్నాడు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో అనేక మంది పత్తి రైతుల పరిస్థితి ఇలాంటిదే.

- దిగుబడి పాయే.. ధర లేదాయే
- ప్రైవేట్ వ్యాపారులు నడ్డి విరుస్తున్నారని దిగాలు
- మెజార్టీ రైతులకు అందని మద్దతు ధర
- కళ్ల ముందే ఆశలు అడియాశలు
- సీసీఐ కొన్నది నామమాత్రంగానే..

సాక్షి,ఆదిలాబాద్: మొదటి రోజు మార్కెట్‌కు వచ్చిన పత్తి వాహనాలకు సంబంధించి ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.6,840 చొప్పున ధర చెల్లించారు. ఆ తర్వాత రోజు నుంచి తేమ ఆధారంగా కోత పెడుతూ రైతులను మార్కెట్లో వ్యాపారులు నడ్డి విరుస్తున్నారు. సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో అంతకంటే ఎక్కువ తేమ వస్తే ఆ రైతునే అసలు పరిగణలోకి తీసుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్దకే వెళ్లాల్సి వస్తోంది. అయితే ఇక్కడే నిలువుదోపిడి జరుగుతోంది. ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521గా నిర్ణయించింది. ఇక్కడ 8 శాతం తేమ ఉంటేనే సీసీఐ మాత్రం ఈ ధర చెల్లిస్తుంది. ఇంతే తేమ ఉన్నప్పటికీ ప్రైవేట్‌లో మాత్రం రూ.7,120 మాత్రమే ఇస్తున్నారు. ఈ రకంగా పత్తి రైతును వ్యాపారులు ఎంత దోపిడి చేస్తున్నారనేది తేటతెల్లం అవుతోంది.

**పత్తి రైతు దుస్థితి..**

జిల్లాలో ఈనెల 25న పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పత్తి ధర విషయంలో రైతులు ఆందోళన చేయడంతో ఆరోజు కొనుగోలే మొదలు కాలేదు. మరుసటి రోజు ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.6,840 చొప్పున చెల్లించి కొనుగోలు చేశారు. ఆ తర్వాత రోజు నుంచి ఆ ధర కూడా ఇవ్వడం లేదు. తేమ ఆధారంగా మరింత కోతలు పెడుతూ రైతులను నిండా ముంచుతున్నారు. ఇప్పటివరకు పత్తి విక్రయించిన రైతుల్లో కనిష్టంగా ఓ రైతుకు 23 శాతం తేమతో క్వింటాలుకు రూ.6,052 చొప్పున కొనుగోలు చేశారు. ఈ లెక్కన మద్దతు ధరకు పత్తి రైతు ఎంత దూరంలో నిలిచాడో తేటతెల్లమవుతోంది.

| జిల్లాలో పత్తి కొనుగోళ్ల వివరాలు |
|---|
| కొనుగోలు ప్రారంభమైన తేదీ : 25 అక్టోబర్ |
| ఇప్పటి వరకు విక్రయించిన రైతులు : 1,443 మంది |
| తీసుకొచ్చిన పత్తి: 26,484 క్వింటాళ్లు |
| సీసీఐ కొనుగోలు చేసింది: 4,235 క్వింటాళ్లు (221 మంది రైతుల నుంచి) |
| ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసింది: 22,248 క్వింటాళ్లు (1213 మంది రైతుల నుంచి) |

### ఆరబెట్టిన పత్తి తీసుకురావాలి



ఆదిలాబాద్ మార్కెట్‌లో నాణ్యమైన పత్తికి మంచి ధర అందేలా చూస్తున్నాం. రైతులు ఆరబెట్టిన పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలి. ప్రభుత్వ మద్దతు ధరను పొందాలి.
– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్

## పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

- కలెక్టర్ రాజర్షి షా


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలో చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఈ సర్వే కీలక పాత్ర పోషిస్తుందని, తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. సందేహాలుంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలన్నారు. డేటా ఎంట్రీ సైతం పక్కాగా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. నవంబర్‌లో నిర్వహించనున్న సర్వే కోసం ఎన్యూమరేటర్ల బ్లాక్, హౌస్ లిస్టింగ్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతీ తహసీల్దార్, ఎంపీడీవోల వద్ద గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నివాస స్థలాల మ్యాప్‌లు, హౌస్ లిస్టింగ్ ఫార్మాట్, 57 ప్రశ్నల ఫార్మాట్, సర్వే పూర్తయిన ఇంటిపై అతికించు స్టిక్కర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. సర్వే నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎల్‌పీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలో ప్రజలను భాగస్వాముల్ని చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

కైలాస్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలను భాగస్వాములను చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడాలనే సమున్నత ఆశయంతో ప్రభుత్వం ఈ సర్వే చేపడుతోందన్నారు. ప్రణాళికశాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తుందని, ప్రతీ మండలానికి ఒక నోడల్ ఆఫీసర్‌గా జిల్లాస్థాయి అధికారిని నియమించాలని, అదనపు కలెక్టర్ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించాలన్నారు. అన్ని శాఖలను సమన్వయపరుస్తూ సమగ్ర కుటుంబ సర్వే విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, సీపీవో వెంకట రమణ, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న రాజేశ్

ఆదిలాబాద్: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా జిల్లా కేంద్రంలో అత్యాధునిక హంగులతో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ల రాజేశ్ మంగళవారం ఎంపీ గోడం నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.7 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి కలెక్టర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు నివేదికలు పంపినట్లు తెలిపారు. ఈ మేరకు కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యేలా చొరవ చూపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీరోజు బడులు తనిఖీ చేయాలి

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి


అడిషనల్ డైరెక్టర్‌తో జిల్లాకు చెందిన ఎంఈవోలు

ఆదిలాబాద్‌టౌన్: మండల విద్యాధికారులు ప్రతీరోజు రెండు పాఠశాలలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంఈవోలతో జిల్లాలోని ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ల కొరత తీరిందని, విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసేలా చూడాలన్నారు. డిసెంబర్‌లో 3,6,9 తరగతులకు న్యాస్ పరీక్ష ఉంటుందని, విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య, వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్లు, ఎంఈవోలు ఉదయ్‌రావు, సరోజ, కంటి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

### పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి


వినతిపత్రం ఇస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మాజీమంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మంగళవారం సీసీఐ డిప్యూటీ జీఎం ఆద్యమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ కమర్షియల్ కొనుగోలు చేస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. గుజరాత్ పత్తి కంటే ఆదిలాబాద్ పత్తి నాణ్యతగా ఉంటుందని, ఇక్కడి రైతులకు ధర తక్కువగా ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 25 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని, ఎమ్మెల్యే, అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై గుడ్‌గోనా చేసి ధర నిర్ణయించి ప్రకటించారన్నారు.

### మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు

కైలాస్‌నగర్: నిర్మల్ నుంచి బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన తనకు పట్టణ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో జాదవ్ కృష్ణ, డీఈ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, శంకర్, ఆర్‌ఐ ఒరగంటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు నమోదుకు దూరం

- ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై పట్టభద్రుల నిరాసక్తత
- ఆసక్తి చూపని టీచర్లు
- నవంబర్ 6తో ముగియనున్న గడువు


తాంసి తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుకోసం ఏర్పాటు చేసిన కౌంటర్

| జిల్లాలో ఓటరు నమోదు వివరాలు | | |
|---|---|---|
| మండలం | పట్టభద్రులు | టీచర్లు |
| మావల | 672 | 85 |
| నేరడిగొండ | 325 | 18 |
| నార్నూర్ | 185 | 16 |
| జైనథ్ | 345 | 08 |
| ఆదిలాబాద్‌రూరల్ | 469 | 24 |
| గుడిహత్నూర్ | 153 | 04 |
| ఇచ్చోడ | 334 | 18 |
| బేల | 246 | 06 |
| గాదిగూడ | 19 | - |
| బోథ్ | 538 | 20 |
| ఉట్నూర్ | 475 | 29 |
| ఆదిలాబాద్‌అర్బన్ | 1825 | 118 |
| బజార్‌హత్నూర్ | 230 | 11 |
| ఇంద్రవెల్లి | 149 | 04 |
| తలమడుగు | 349 | 08 |
| భీంపూర్ | 144 | 02 |
| తాంసి | 152 | 03 |
| సిరికొండ | 62 | 06 |

**నమోదు చేసుకోవడం ఇలా...**

పట్టభద్రులు ఓటరుగా నమోదు కోసం ఫారం–18తో దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తయి ఉండాలి. టీచర్లు, అధ్యాపకులైతే 2018 నవంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 వరకు మూడు సంవత్సరాలకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయిలో బోధించి ఉండాలి. ఇలాంటి వారు ఫారం–19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గెజిటెడ్ అధికారి ధృవీకరించిన డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతో పాటు ఫొటోతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో www.ceotelangana.nic.in లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు.

కైలాస్‌నగర్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ ఆదిలాబాద్ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ప్రక్రియ ప్రారంభమై మంగళవారం నాటికి నెల రోజులవుతున్నా ఓటరుగా నమోదుపై అంతగా ఆసక్తి చూపడం లేదు. నవంబర్ 6వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఇందుకు మరో వారం రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటి వరకు ఆసక్తి చూపని ఓటర్లు ఏడు రోజుల వ్యవధిలో ఎంతమంది నమోదు చేసుకుంటారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఎమ్మెల్సీగా పోటీ పడే ఆశావాహులు ప్రత్యేక పోస్టర్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి ఆశించిన ఫలితం కన్పించడం లేదు. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఓటుపై అంతగా ఆసక్తి చూపడం లేదు.

**ప్రత్యేక కేంద్రాలకు స్పందన కరువు**

ఎమ్మెల్సీ స్థానానికి ఓటర్లుగా నమోదు కోసం జిల్లాలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రత్యేక ఉద్యోగులను నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచినప్పటికీ స్పందన మాత్రం కన్పించడం లేదు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించినప్పటికీ దరఖాస్తులు కూడా నామమాత్రంగానే ఉంటున్నాయి. అటు పట్టభద్రులు, ఇటు టీచర్లు అంతగా ఆసక్తి చూపకపోవడంతో ఓటరు నమోదుకు జిల్లాలో స్పందన కరువవుతోంది.

**పట్టించుకోని టీచర్లు**

ఓటరు నమోదును జిల్లాలోని ఉపాధ్యాయులు అంతగా పట్టించుకోవడం లేదు. ఇందుకు ఇప్పటి వరకు అందిన దరఖాస్తులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలోని 18 మండలాల పరిధిలో సుమారు 15 వేలమంది పట్టభద్రులు ఉంటారని అంచనా వేస్తుండగా ఇప్పటి వరకు 6,662 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన చూస్తే వీరి నమోదు సైతం తక్కువగానే కన్పిస్తోంది. టీచర్లతో పోల్చితే కాస్తా పర్వాలేదనిపిస్తోంది. ఉపాధ్యాయ ఓటర్ల నమోదు మాత్రం నత్తనడకన కొనసాగుతోంది. పోటీలో నిలిచే అభ్యర్థులు ఇది వరకే జిల్లాలో పర్యటించి ఉపాధ్యాయ సంఘాలు, పట్టభద్రులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి మద్దతు అందించాలని కోరారు. జిల్లాలో 2,700 మంది ఉపాధ్యాయులు ఉన్నట్లుగా విద్యాశాఖ గణంకాలు చెబుతున్నాయి. ఇందులో ఇప్పటి వరకు కేవలం 380 మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికతో తమకు ఒరిగేదేముందనే భావనతోనే నమోదుకు ముందుకు రానట్లుగా తెలుస్తోంది.

**మావల భేష్ ...**

ఓటర్ల నమోదులో చిన్న మండలమైన మావల ఆదర్శంగా నిలుస్తోంది. కేవలం మూడే గ్రామ పంచాయతీలు ఉన్న ఈ మండలంలో ఇప్పటి వరకు 672 మంది పట్టభద్రులుగా, టీచర్లు సైతం 85 మంది ఓటరుగా నమోదు చేసుకుని భేష్ అనిపించారు. ఇతర మండలాలను పరిశీలిస్తే జిల్లాలోని ఏడు మండలాల్లో రెండంకెల సంఖ్య కూడా దాటని పరిస్థితి ఉండటం గమనార్హం. పట్టణ ప్రాంతమైన ఆదిలాబాద్ అర్బన్ ఓటర్ల నమోదులో అగ్రస్థానంలో నిలువగా గిరిజన మండలమైన గాదిగూడ అట్టడుగు స్థానంలో నిలుస్తోంది. ఇక్కడ పట్టభద్రులు 19 మంది నమోదు చేసుకుంటే టీచర్లు ఒక్కరు కూడా తమపేరును ఎన్‌రోల్ చేసుకోకపోవడం జిల్లాలో సాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియ తీరుకు అద్దం పడుతోంది.

# జిల్లా ఓటర్లు @ 4,58,338

- పురుషుల కంటే మహిళలే అధికం
- ముసాయిదా ఓటరు జాబితా విడుదల
- నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ


ఓటు వేసేందుకు క్యూకట్టిన ఓటర్లు (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లాలో 4,58,338 మంది ఓటర్లు ఉన్నట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను కలెక్టర్ రాజర్షి షా మంగళవారం విడుదల చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరేట్‌తో పాటు ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని తహసీల్దార్ కార్యాలయాల నోటీసుబోర్డులపై అందుబాటులో ఉంచారు. బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వో)ల వద్ద అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాలో పురుష ఓటర్లు 2,23,176 మంది, మహిళా ఓటర్లు 2,35,154 మంది, ఇతరులు మరో 8 మంది ఉన్నారు. పురుషులతో పోల్చితే జిల్లాలో మహిళా ఓటర్లు 11,978 మంది ఎక్కువగా ఉన్నారు.

**28 వరకు అభ్యంతరాల స్వీకరణ**

ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 29 నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు సైతం అవకాశం కల్పించారు. నవంబర్ 9, 10 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను సైతం నిర్వహించనున్నారు. అధికారులకు అందిన అభ్యంతరాలు, ఆక్షేపణలను డిసెంబర్ 24లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించి 2025 జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 1,20,382 | 1,25,855 | 06 | 2,46,243 |
| బోథ్ | 1,02,794 | 1,09,299 | 02 | 2,12,095 |

## జిల్లాస్థాయి యోగా పోటీలు


యోగాసనాలు ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం అండర్ 14, 17 బాల బాలికల జిల్లాస్థాయి యోగాసన ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. 82 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడ్డారు. పోటీల కన్వీనర్ పీడీ రేణుక, యోగా మాస్టర్లు సంతోష్, చేతన్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పీడీ రేణుక మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు నవంబర్ 2న నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే జోనల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జోనల్ పోటీల్లోనూ సత్తా చాటిన వారు కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### జైనూర్ ఘటన నిందితుడిపై పీడీ యాక్టు నమోదు

ఆసిఫాబాద్: జైనూర్ ఘటన నిందితుడు ముగ్దుంపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి జైలులో నిందితుడికి మంగళవారం పీడీయాక్టు ప్రతాలు అందించారని పేర్కొన్నారు. పీడీ యాక్టులు నమోదుతో నేరాలు తగ్గుముఖం పడుతాయని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### మట్కా నిర్వాహకుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన ప్రతాప్ సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి మంగళవారం పట్టుకున్నారు. రూ.6040 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

### అడవిపందిని హతమార్చిన కేసులో ఏడుగురి రిమాండ్

సిర్పూర్(టి): మండలంలోని లక్ష్మీపూర్ అటవీప్రాంతంలో అడవి పందిని హతమార్చిన కేసులో ఏడుగురికి మంగళవారం రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి అందిన సమాచారంతో అటవీ అధికారులు వెళ్లి ఆదివారం వారిని పట్టుకుని విచారించారు. అడవి పందిని దాడి చేసి హతమార్చిన ఘటనలో 8 మంది ఉన్నారని తేలింది. సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ పరిధిలోని బెంగాలీ క్యాంపునకు చెందిన దీపక్ ఠాగూర్, ప్రణబ్ మండల్, గౌతమ్ సర్కార్, శంకర్, అరవింద్, అశోక్, పోశంలను అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించగా, కమలేష్ పరారీలో ఉన్నారని ఎఫ్ఆర్వో తెలిపారు.

### అట్రాసిటీ కేసులో ఇద్దరు..

ఆదిలాబాద్‌రూరల్: అట్రాసిటీ కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మావల మండలంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన సుఖ్‌దేవ్ సన్నిని గత ఆగస్టులో అదేకాలనీకి చెందిన కురాడే కైలాస్, మధు, తల్లి దుర్పదబాయి, అక్కా శైలజ దాడి చేసి కులం పేరుతో దూషించారు. బాధితుడు గతంలో ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ ఈ నలుగురు కలిసి మరోసారి దాడి చేశారు. తర్వాత బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మంగళవారం కైలాస్, మధును రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. దుర్పదబాయి, శైలజ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు.

### ఇసుక డంపులపై దొంగలు పడ్డారు



సీజ్ చేసిన ఇసుక డంపులో నుంచి ఇసుక దొంగిలిస్తున్న వ్యక్తులు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులపై మంగళవారం దొంగలు పడ్డారు. స్థానిక కాలేజీ రోడ్‌లో కొందరు అక్రమంగా గోదావరి నుంచి ఇసుకను తరలించి రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచిన ఇసుక డంపులను మైనింగ్, రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. 24 గంటలు గడవకముందే పట్టపగలే యథేచ్ఛగా కొందరు ఇసుక డంపుల నుంచి ఇసుకను దొంగిలించారు. దీంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.



# 'మహా' ఎన్నికలకు మన మద్యం 'పేకాట'కు పెట్టుబడి!

- మంచిర్యాల జిల్లా నుంచి అక్రమంగా తరలింపు
- మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి వ్యాపారులకు వరం
- 'మామూలు'గా చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



ఈనెల 25న మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న మద్యం



మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో సమావేశమైన సీపీ శ్రీనివాసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: తెలంగాణకు చెందిన మద్యం, మనీ మహారాష్ట్రకు అక్రమంగా తరలిపోతోంది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మద్యనిషేధం అమలులో ఉంది. పైగా కేంద్ర ప్రభుత్వం ఈనెల 15న మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అక్కడి వివిధ పార్టీలకు చెందిన నాయకులు మన మద్యాన్ని అక్రమంగా తరలించుకుపోయి నిల్వ చేసుకుంటున్నట్లు సమాచారం. సరిహద్దు గ్రామీణ ప్రాంతాల నుంచి మద్యంతో పాటు నగదు తరలిపోతోంది. మహారాష్ట్రలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఇప్పటికే రామగుండం సీపీ శ్రీనివాసులు గడ్చిరోలి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు పోలీసులతో సమావేశం నిర్వహించారు. మద్యం, మనీ తరలింపు, మావోయిస్టుల కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని, ప్రత్యేక టీంలు 24/7 సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తెలంగాణ సరిహద్దున ఉన్న మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మహారాష్ట్రలోని ముఖ్య పట్టణాలకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, నాందేడ్, యావత్మల్, గడ్చిరోలి జిల్లాలు తెలంగాణకు సరిహద్దున ఉన్నాయి. గడ్చిరోలి జిల్లాకు చెన్నూర్ పట్టణానికి సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. గోదావరి పక్కనే సిరోంచ ఉండడంతో ఇక్కడి నుంచి ఈజీగా మద్యం, నగదు తరలించే అవకాశం ఉంది.

**గోదావరి నదిపై తరలింపు..**

మహారాష్ట్రలో మద్య నిషేధం అమలులో ఉండడంతో రూ.10 నుంచి రూ. 20 వరకు అదనంగా అమ్మకాలు రహస్యంగా జరుపుతున్నారు. ప్రాణహిత సరిహద్దు వెంట గోదావరి నదిపై మన మద్యం మహారాష్ట్రకు తరలుతోంది. గడ్చిరోలి జిల్లా సిరోంచ వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు నుంచి మంచిర్యాల, చెన్నూర్ మీదుగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి ప్రాంతాలకు చెందిన కొందరు మద్యం వ్యాపారులకు ఈ దందా వరంగా మారింది. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### మచ్చుకు కొన్ని సంఘటనలు..

- 2024 మే 27న మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు ఒక టాటాఏస్ వ్యాన్‌లో రూ.2 లక్షల విలువైన అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారని సమాచారంతో భీమారం పోలీసు స్టేషన్ పరి ధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మ ద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు కోట పల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన మ హ్మద్ షరీఫ్, తిప్పని రామయ్యను అరెస్ట్ చేశారు.
- ఈనెల 17న కోటపల్లి మండలంలోని పారిపెల్లి వైన్స్ షాపు నుంచి ఆలుగాం గ్రామానికి చెందిన ముగ్గురు ఆటో, బొలెరో వాహనాల్లో రూ.3 లక్షల విలువ గల మద్యం తరలిస్తున్నారు. కోటపల్లి పోలీసులు తనిఖీ చేసి పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- ఈనెల 25న మంచిర్యాలలోని ఓ వైన్స్ షాప్ నుంచి కోటపల్లి మండలం సిర్సాకు చెందిన పెండ్యాల కిరణ్ రూ.40 వేల విలువ గల మద్యం, స్విఫ్ట్ డిజైర్ కారులో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

### బెల్ట్‌షాపులు మూసేశాం



సరిహద్దు ప్రాంతాల్లోని బెల్ట్‌షాపులు మూసేశాం. మన మద్యం మహారాష్ట్రకు అక్రమంగా తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నాం. చెక్‌పోస్టుల వద్ద పోలీసు, ఎక్సైజ్ సిబ్బందితో తనిఖీలు చేపడుతున్నాం.

– కే.జీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి, మంచిర్యాల

### ప్రత్యేక నిఘా పెట్టాం



మన మద్యం అక్రమంగా మహారాష్ట్రకు తరలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. సరిహద్దు ప్రాంతాల్లో ఫెర్రీ పాయింట్స్, సిరోంచ గోదావరి బ్రిడ్జిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. ఎన్నికల సిబ్బంది, పోలీస్ స్పెషల్ టీమ్ 24/7 తనిఖీలు చేపడుతున్నాం. ప్రాణహిత నది ద్వారా నాటుపడవల ద్వారా మద్యం తరలించే అవకాశం ఉన్నందున టాస్క్‌ఫోర్స్ పోలీసులతో ప్రత్యేక నిఘాపెట్టాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

- పత్తాలాటనే వృత్తిగా మలుచుకున్న వైనం
- రూ.లక్షలు పెట్టి.. రూ.కోట్లు సంపాదన
- మహారాష్ట్ర క్లబ్బుల్లో మంచిర్యాల వాసులే..



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో నడుస్తున్న పేకాట క్లబ్‌కు పెట్టుబడి అంతా మంచిర్యాల పట్టణం నుంచే సమకూ రుతోంది. చంద్రాపూర్ జిల్లా రాజురా తాలూక సోన్నూర్‌లో సోషల్ క్లబ్ పేరిట నడుస్తున్న దందాలో మంచిర్యాల పట్టణానికి చెందిన వారే ఉన్నారు. ఇక ఆదిలాబాద్ దాటాక యావత్మాల్ జిల్లా పటాన్‌బోరిలో ఎన్‌హెచ్–44 జాతీయ రహదారి పక్కనే ఉన్న పేకాట క్లబ్‌లకు జిల్లా నుంచి పెట్టుబడిదారులు ఉన్నారు. సోన్నూర్ క్లబ్‌కు గత కొన్నేళ్లుగా పత్తాలాటలో ఆరి తేరి ఇప్పటికే 30కి పైగా కేసుల్లో ఇరుక్కున్న ఎన్టీపీసీ మాజీ ఉద్యోగి, మంచిర్యాల పట్టణానికి చెందిన ఓ ఫైనాన్షియర్ డబ్బులు సమకూర్చుతున్నారు. అందులో ఆయనతోపాటు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రముఖ హోటల్ భాగస్వామి కూడా ఉన్నారు. ఈ వ్యసనాన్ని క్యాష్ చేసుకునేందుకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. పేకాట క్లబ్‌లకు వీరిద్దరు ప్రధాన సూత్రధారులుగా ఉన్నారు. గతంలో రామగుండం సీపీ సత్యనారాయణ కమిషనరేట్ పరిధిలో పేకాట ఆడేవారి, నిర్వాహకులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తరచూ పట్టుబడుతూ తీరు మారని నిర్వాహకుడిపై రాష్ట్రంలోనే ప్రథమంగా పీడీ యాక్టు నమోదు చేశారు. అయినా ఆయన తీరు మారకుండా ఇప్పటికీ అదే ఆటలో సంపాదనకు తెగబడ్డారు. ఇక జన్నారానికి చెందిన ఒకరితోపాటు మరికొందరు కలసి రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పటాన్ బోరిలో ఉన్న ఓ క్లబ్‌ను నడిపిస్తున్నారు. అక్కడ కూడా ఉమ్మడి జిల్లాతోపాటు పలువురు జూదం ఆడేందుకు పిలుస్తున్నారు.

**పట్టని యంత్రాంగం**

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటికీ ఈ క్లబ్‌లకు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకపోవడంతో యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం 200మందికి పైగా వందకు పైగా కార్లలో రాకపోకలు సాగిస్తున్నారు. సెలవు దినాల్లో ఆటగాళ్ల తాకిడి ఎక్కువగా ఉంటోంది. పేకాట పేరుతో రూ.లక్షల లావాదేవీలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఎక్కడా ఎవరూ అడ్డు చెప్పడంలేదు. మరోవైపు తెలంగాణ సరిహద్దుగా ఉన్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం గోయగాం వద్ద తనిఖీల్లోనూ ఆటగాళ్లు ఎవరూ పట్టుబడడం లేదు. దీంతో యథేచ్ఛగా పేకాట ఆడుతున్నారు. జిల్లా నుంచే పలువురు ఆటగాళ్లు(పంటర్లు) ఓ వ్యసనంగా మారి రూ.లక్షలు అప్పుల పాలయ్యారు. ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు, రియల్టర్లు, భూములు తాకట్టు పెట్టుకున్నంటున్న ఘటనలూ ఉన్నాయి. అప్పుల పాలయ్యాక కూడా ఆస్తులు, భూములును కుదువ కింద ఫైనాన్షియర్ చేతుల్లోనే పెట్టుకుంటున్నారు. బయటకు చెప్పుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారు.

**రూ.కోట్లు సంపాదన**

పేకాటలో రోజుకు రూ.లక్షల్లో లావాదేవీలు జరుగుతుండగా, నెలకు రూ.కోట్లలోనే సంపాదన ఉంటోంది. ఈ సంపాదనలో కొంత మేర ఖర్చులకు పోను మహారాష్ట్రతోపాటు తెలంగాణ సరిహద్దు ప్రాంత అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు భారీగా మామూళ్లు ఇస్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోనూ ఆ నియోజకవర్గ నాయకులు, అభ్యర్థులకు డబ్బులను పార్టీ ఫండ్‌గా ఇచ్చే స్థాయికి ఎదిగారు. కేవలం జూదమాడుతూనే మంచిర్యాల పట్టణంలో ఉన్న ఓ ఫైనాన్షియర్‌గా మారి అనతికాలంలోనే కోటీశ్వరుడిగా ఎదిగారు. ఇప్పటికీ పత్తాలాటలో దొరికిన కేసులు ఉన్నా, జూదమే తన వృత్తిగా మలుచుకుని సొమ్ము సంపాదిస్తున్నాడు.

## ఆస్పత్రికి వెళ్తూ.. కానరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
- బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న వాహనం
- దివ్యాంగుడైన భర్తకు స్వల్పగాయాలు
- గుడిహత్నూర్ జూనియర్ కళాశాల సమీపంలో ఘటన



సంఘటన స్థలంలోనే మృతిచెందిన రమ్యక్రిష్ణ, పక్కన గాయాలతో భర్త మధుకర్



రమ్యక్రిష్ణ (ఫైల్)

గుడిహత్నూర్: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందగా, దివ్యాంగుడైన భర్తకు స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్‌కు చెందిన జాదవ్ మధుకర్–రమ్యక్రిష్ణ (30)భార్యాభర్తలు. భర్త మధుకర్ దివ్యాంగుడు, కోకస్‌మన్నూర్‌లో కిరాణషాపు నడిపిస్తున్నాడు. రమ్యక్రిష్ణ.. లేడీస్ ఎంపోరియం నడిపిస్తోంది. వీరికి మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. గ్రామంలో ఇటీవల మీ సేవ కేంద్రం మంజూరైంది. రమ్యక్రిష్ణ శిక్షణ సైతం తీసుకుంది. గత కొంతకాలంగా ఈమె చర్మవ్యాధితో బాధపడుతోంది. రెండు రోజులుగా చర్మంపై దద్దుర్లు వచ్చాయి. ఈ క్రమంలో మంగళవారం భర్తతో కలిసి బైక్‌పై రిమ్స్‌కు వెళ్లేందుకు బయల్దేరింది. గుడిహత్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. జాతీయ రహదారి 44పై పక్కన రెయిలింగ్‌పై రమ్యక్రిష్ణ ఎగిరిపడింది. ఆమె రెండు చేతులు విరిగిపోయి, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. హెల్మెట్ ధరించి ఉండడంతో భర్తకు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే వారిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు భర్తకు చికిత్స అందిస్తున్నారు. మధుకర్ తండ్రి తుకారాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి 6, 7 ఏళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## పండుగ వేళ విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం
- అడెపల్లి సమీపంలో కల్వర్టు ఢీకొన్న బైక్
- ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి



ప్రమాదస్థలంలో రోదిస్తున్న కూతురు వెన్నెల

చింతలమానెపల్లి: దీపావళి పండుగ వేళ కూతురిని ఇంటికి తీసుకువస్తుండగా తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటన మండలంలోని అడెపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన జాడి రాజమల్లు (48)కు కుమార్తె వెన్నెల ఉంది. వెన్నెలను చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన అవినాష్‌తో ఇటీవల వివాహం జరిపించారు. దీపావళి సందర్భంగా కుమార్తెను ఇంటికి తీసుకెళ్లేందుకు తండ్రి బైక్‌పై మంగళవారం బాబాసాగర్‌కు వచ్చారు. తర్వాత తిరుగు ప్రయాణమయ్యాడు. కుమార్తె వెన్నెల, అల్లుడు అవినాష్ మరో బైక్‌పై బయల్దేరారు. అడెపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో మలుపు వద్ద రాజమల్లు బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల బైక్‌పై వస్తున్న కూతురు, అల్లుడు ఆగి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా, మృతుడికి వివాహమైన ఇద్దరు కుమార్తెలు, మరో కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## జూడో పోటీల్లో 12 పతకాలు

- సత్తాచాటిన క్రీడా పాఠశాల విద్యార్థులు



విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడా పాఠశాల విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 బాల,బాలికల జూడో పోటీల్లో సత్తా చాటారు. 12 పతకాలు సాధించి ఔరా అనిపించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని కెమిస్ట్రీ భవన్‌లో సోమ, మంగళవారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లా క్రీడాకారులు 9 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్య పతకాలతో ఓవరాల్ చాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. 40 కేజీల విభాగంలో డి. సునీత, జి. సహస్ర, చాందిని, అలేఖ్య, శ్రీజ, సతీశ్, హర్షవర్ధన్, అఖిల్, 81 కేజీల విభాగంలో మధు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. 48 కేజీల విభాగంలో టి. సింధు (రజతం), 63 కేజీల విభాగంలో వసుధ, 73 కేజీల విభాగంలో సంతోష్‌లు (కాంస్య) పతకాలు సాధించారు. టోర్నమెంట్లో బెస్ట్ ప్లేయర్‌గా సతీశ్ నిలిచాడని కోచ్ రాజు వెల్లడించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారు నవంబర్ 7 నుంచి 12వ తేదీ వరకు జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

### నేడు హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో అండర్–14 హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఫణిరాజా ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు సంప్రదించాలని సూచించారు.

### ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



విజయేందర్ (ఫైల్)

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరి.దిలోని లంబడితండాకు చెందిన విజయేందర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. విజయేందర్(48) గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బా.దపడుతున్నాడు. ఆస్పత్రికి వెళ్లిన నయం కాలేదు. మంగళవారం ఉదయం కడుపునొప్పి రావడంతో మందులు వేసుకున్న తగ్గలేదు. మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు ఈశ్వర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

**పురుగుల మందు తాగి ఒకరు..**

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని చోర్‌పల్లి గ్రామానికి చెందిన చిచోల్‌కార్ నారాయణ(56) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో మంగళవారం ఉదయం ఇంటి పక్కన గల పెరట్లో పురుగుల మందు తాగి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య సావిత్రి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### 'ఆయుష్మాన్ భారత్' సద్వినియోగం చేసుకోవాలి

పాతమంచిర్యాల: ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ కోరారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అంటు, సంక్రమిత, సికిల్‌సెల్ తదితర వ్యాధులు గుర్తించి వైద్య సేవలు అందుతాయన్నారు. ఈ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించగా, టీవీలో వీక్షించారు. అదనపు వైద్యాధికారి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

కోటపల్లి: మండలంలోని వైద్యసిబ్బందికి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంపై పీహెచ్‌సీ వైద్యురాలు ఆరుణశ్రీ అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- ముగిసిన ఉమ్మడి జిల్లా అండర్ 14, 19 పోటీలు



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు నిరుత్సాహం చెందవద్దని సూచించారు. జిల్లాకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14, 19 పోటీలు మంగళవారంతో ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 13 మంది గురుకులాల విద్యార్థులు పోటీపడ్డారు. అండర్–19 విభాగం ఖోఖో, కబడ్డీ పోటీల్లో గన్నారం జట్టు (ప్రథమ), ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీలో ఆదిలాబాద్ జట్టు విజేతగా, బెల్లంపల్లి ద్వితీయ స్థానంలో నిలిచింది. గన్నారం జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. అండర్–14 విభాగంలో ఆసిఫాబాద్ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. విజేతలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినవారు సిద్దిపేట జిల్లా వర్గల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ శైలజ వివరించారు. ఆర్సీఓ గోపీచంద్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. కీర్తి, జైనథ్ ప్రిన్సిపాల్ ఉమాదేవి, పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఆలయానికి రూ.11లక్షల విరాళం



అమ్మవారిని దర్శించుకుంటున్న తోటపల్లి మధు

ముధోల్: బాసర సరస్వతీ అమ్మవారికి దాత రూ.11 లక్షల విరాళం అందించాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అనకాపల్లికి చెందిన విజయ సరస్వతీదాసు మంగళవారం ఈవో విజయరామారావుకు చెక్కు అందజేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి ప్రసాదం అందించారు. ఆలయ అధికారులు ఉన్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న సినీ రచయిత మధు**

బాసర సరస్వతీ అమ్మవారిని మంగళవారం సినీ రచయిత తోటపల్లి మధు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని పూజలు చేశారు. అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ప్రసాదం అందించారు.

## పర్యావరణహితం కోసమే సైకిల్‌యాత్ర



మాట్లాడుతున్న సైకిల్ యాత్రికుడు అంకుశ్ చార్లెస్

దిలావర్‌పూర్: పర్యావరణంలో నానాటికీ జరుగుతున్న మార్పులు, పలు కాలుష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టినట్లు తమిళనాడు చెందిన అంకుశ్ చార్లెస్ తెలిపారు. దిలావర్‌పూర్ గ్రామం మీదుగా వెళ్తున్న ఆయన..ఇథనాల్ వ్యతిరేక దీక్షాశిబిరం వద్ద ఆగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి, నీరు కాలుష్యం అయితే ప్రజల జీవనానికే తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. పచ్చని పంట చేలు, పల్లెల నడుమ ఇథనాల్ ఫ్యాక్టరీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మన ప్రాంతానికి ముప్పువాటిల్లుతుందంటే చివరి వరకు పోరాటం చేయాలన్నారు. ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

### కాకోను దర్శించుకున్న ఎంపీ నగేశ్



కాకోను దర్శించుకుంటున్న ఎంపీ నగేశ్

దండేపల్లి: మండలంలోని గుడిరేవులో ఆదివాసీల ఆరాధ్యదైవం శ్రీపద్మల్‌పురి కాకో ఆలయంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సోము, సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం దండారీ ఉత్సవాల్లో భాగంగా ఆదివాసీ గిరిజనులు చేసిన గుస్సాడీ నృత్యాలను తిలకించారు. గిరిజన కళాకారుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీటిని తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఎంపీ వెంట గుడిరేవు మాజీ సర్పంచ్ మంజుభార్గవి తదితరులు ఉన్నారు.



నృత్యాలు చేస్తున్న ఆదివాసీ కళాకారులు



ఆకట్టుకునే గుస్సాడీ వేషధారణ